కథానిక

# బలహీనుడు చేసిన ప్రతిజ్ఞ

"సుబ్బన్న"

ఆ ఊరంతా కలియ తిరిగాడు. మూడు నెల్లబట్టీ ఆపని చేస్తూనే ఉన్నాడు. ఆరోజున హఠాత్తుగా అతనికి కనిపించింది. తన కోరిక ఈడేరదని నిరుత్సాహపడిన సమయంలో ఆపని జరిగింది.

డసిలిపోయిన అతని మనస్సుకో పన్నీటి జల్లు; సడలిపోయిన అతని ఆశకో ఆధారం; అలసిపోయిన అతని హృదయానికో అమృత ధార.

ఊరికి ఉత్తరంగా కొంచెందూరంలో ఉంది. చూసి తన్మయుడైనాడు. రోజూ వెళ్ళడం మొదలెట్టాడు.

తూర్పున మిరపచేలు, పడమట వరిచేలు, ఎదుట కందిచేలు, వాటి మధ్యనో స్మశాన వాటిక.

ఆ ఊరివారికది స్మశానవాటికే; నాగరాజుకది నందనవనం. గోరీల మధ్యగా ఉన్న రాతి పలక నాగరాజుకో ఉన్నతాసనం.

మిరపచేలు అందానికి బంతిపూలు రూపులు తొడిగినై, రంగులు దిద్దినై. కందిచేల మధ్యనున్న కుప్పల మీద పాలపిట్టలు వరుసలు తీర్చినై.

విరగ పూసిన బంతిపూలచుట్టూ తెగతిరిగే తేనెటీగలు, పచ్చని మొక్కల క్రింద ఎర్రని మిరప పళ్లు, ఆ ప్రక్కనే రొదపెట్టే వరి చేలు, ఎదురుగా తలలూచే కందిచెట్లు వాటిపైగా బారులు తీర్చిన పక్షుల వరుసలు, ఆ పక్షులపైన కదిలిపోయే సాయంకాలపు రంగు మేఘాలు — చూస్తూ కూర్చునేవాడు నాగరాజు జిజ్ఞాసగా.

రోజంతాపనిచేసి సాయంకాలానికి కొంపకు చేరే పడుచులు నాగరాజును చూసి గుసగుసలాడేవారు. కొంచెం దూరంవెళ్ళి పకపక నవ్వేవారు. గబగబ నడిచే ఆ పడుచులనవ్వు నాగరాజు హృదయంలో నృత్యంచేసి పెదవులమీద మొలకలెత్తేది.

నాగరాజు ఆకాశంలోకి చూస్తున్నాడు. వంపులు తిరిగిన నల్లమేఘం చంకీ 'బార్డరు' వల్లె కప్పుకొన్నది.

ఉన్నట్టే ఉండి ఆ ఆవిరి కన్నె కదిలిపోతున్నది. చెంకీ'బార్డరు' చెదిరిపోయింది. నాగరాజు కనురెప్పలు వాలిపోయినై; బంతిచెట్లు తలలూపినై; తేనెటీగలు పైకిలేచినై; నాగరాజు మైమరిచాడు.

జారిపోతున్న గడ్డిమోపు క్రింద పడేసింది. చేతిలోని కొడవలి గోరీమీద పెట్టింది. చీరె దులిపి పైట బిగించి కుచ్చెళ్లు సరిచేసుకొన్నది. గడ్డిని ఒకచోటికి పొదివి మూట బిర్రుగాకట్టింది. పైకి ఎత్తుకోలేక అటూఇటూ చూసింది. గోరీల మధ్యన నాగరాజు. కళ్ళు తుడుచుకొని మళ్ళీ చూసింది. ఆయనే! రెప్పలార్చి తీరిగ్గా చూసింది. కరణంగారింట్లో అద్దెకున్న మేస్టరు. తనకు తెలిసిన మనిషే—నాగరాజు ఈలోకంలో లేడు.

"ఓ! యామండోయ్!" అని గట్టిగా అరిచింది.

నాగరాజు త్రుళ్ళిపడి కళ్లు తెరిచాడు. కరణంగారి పని మనిషి కూతురు లక్ష్మి. మనస్సులో మేలి ముసుగు మేఘకన్య కళ్లెదుట బిగయగట్టిన పడుచుపిల్ల. నాగరాజుకు అయోమయంగా ఉంది.

"ఈడుండారేం?"

"ఊరికినే" సన్నగా అన్నాడు.

"పొద్దుగూకి సాశానంలో కూసుండారేం?" గట్టిగా అడిగింది.

ఆ మొరటు పడుచుకేమి చెప్పాలో నాగరాజుకు తెలియలేదు. నాగరాజు కళ్లు తెరచి కలియ చూశాడు. పరిస్థితి అర్థమైంది. గడ్డి మోపు దగ్గరకు చకచక నడిచాడు. మోపు పడుచు నెత్తికెత్తేసరికి నాగరాజు నాలు గడుగులు వెనక్కువేసి ఉక్కిరిబిక్కిరైనాడు. ఆ పడుచు కొడవలి పట్టుకొని చకచక నడిచే

స్తున్నది. నెత్తిమీద బరువుందనే లక్ష్యమేలేదు. నాగరాజు గుటకమ్రింగి కూర్చున్నాడు.

ఇంటరు పరీక్షయినాడు గనుక నాగరాజును బి. ఏ. చదివించారు. అదీ ప్యాసయిన తరువాత "బి. ఎ. ఎందుకు చదివినట్లు?"-అని ప్రశ్నించుకొన్నాడు. అతని కేమీ తెలియలేదు; చదివించిన అన్నగారికీ తేలియలేదు. అన్నగారు అనుభవజ్ఞులు గనుక విజ్ఞానంకోసమని సమాధానమిచ్చారు. నాగరాజు వెంటనే ఒక తప్పు చేశాడు. తాను బి. ఎ. చదవకముందు ఎట్లా వున్నదీ, చదివిన తరువాత ఎట్లా వున్నదీ పోల్చి చూసుకొన్నాడు. అదీ అతడుచేసిన పొరపాటు.

అన్నగారు అబద్ధమాడేరని తీర్మానించుకొని అయిపోయిన దానికి చేసేదేమీలేదని తెలుసుకొని, విధిలేక బి. ఇడి. అనిపించుకొని బడి పంతులైనాడు నాగరాజు. అంతటితో సరిపెట్టుకొని ఏదో విధంగా బ్రతకవచ్చునా? అదీ లేదు. అక్కడే వచ్చింది అతనితో చిక్కు.

"ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది. ఆ పవిత్రతను కాపాడటానికి తానేమిచేయ్యాలి?" ఈ ప్రశ్నతో కుస్తీపట్టాడు. గొడవపడ్డాడు. మూడు సంవత్సరాలు క్రిందా మీధు అయిన తర్వాత తన అనుభవాన్ని తరిచి ఓ విషయాన్ని తేల్చాడు. దాన్ని డైరీలో వ్రాసుకొన్నాడు:

"ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదనిఅనడంలో సత్యం ఇసుమంతైనా లేదు. అన్ని వృత్తులూ ఎంత చెడ్డవో అదీ అంతే చెడ్డది. ఇతర వృత్తు లెంత మంచివో అదీ అంతే మంచిది."

పోనీ అంతటితో ఆగాడా? అదీలేదు. ఆ వాక్యానికో తోక తగిలించాడు.

"ఉపాధ్యాయ వృత్తిలో మానవుడు తన జీవితావసరాలు పూర్తిగా పొందలేడు గనుక అతన్ని ఊరడించడానికి ప్రజలు దాన్ని పవిత్రమైనది, పవిత్రతమమైన వృత్తీ అన్నారు."

తీర్మానాన్ని వ్రాసిపెట్టుకొన్నాడు. దాని యధార్థతను తన కళ్ళతోనే చూస్తున్నాడు. ఐనా తరతరాలుగా- ఖచ్చితంగా చెప్పాలంటే అనాదిగా వస్తూవున్న ఆమాట "ఉపాధ్యాయ వృత్తి మహాపవిత్రమైనద"నే విషయం తన హృదయంలోనుండి పూర్తిగా తొలగించలేక పోయినాడు. అందువల్ల ఏదో ఘనకార్యం చేయవలసిన బాధ్యత తనమీదఉన్నదని తీర్మానించుకున్నాడు. అదే తన జీవిత చరమ లక్ష్యమని శపథం చేశాడు. గడ్డిమూట పైకెత్త లేని బలహీనుడు చేసిన ప్రతిజ్ఞ కనుక భూమి బ్రద్దలవలేదు.

తమ పిల్లలకు ప్రయివేటు చెప్పమని ధనికుల దగ్గరనుండి వచ్చిన ఆహ్వానాన్ని అంగీకరించలేదు. ఆ విషయంలో హెడ్మాస్టరుగారు చేసిన సిఫారసును సైతం త్రోసిపుచ్చాడు. తన కందుబాటులో ఉన్న పేదపిల్లల సంగతి చూడాలనుకొన్నాడు. ఆ వూరిలోని హరిజన "హాస్టల్" నాగరాజు నాకర్షించింది. లోపలి కెళ్ళాడు. పందులకు వేసే గుడిసెల లాంటివి నాలుగున్నై. అదే "హాస్టల్" అన్నారు. ఒకగుడిసెలో వంట, మరొకదానిలో సామాను. మిగత రెండు వసతి గృహాలు. పాతికమంది విద్యార్థులు నివసిస్తున్నారు. నాగరాజు కరిగి పోయినాడు. ముక్కు మూసుకొని ఒక గుడిసెలో దూరబోయి చప్పున బైటపడ్డాడు. భరించరాని గవులు కొట్టింది. పిల్లలు మాట్లాడితే వాసన, కదిలితే కంపు. అందులో అయిదో ఫారం చదివే విద్యార్థులుండటం నాగరాజుకు ఆశ్చర్యమేసింది. వమనం చేసుకొని రోడ్డు చేరాడు. పెద్ద నీటిబాన నెత్తిన పెట్టుకొని ఎదురుగా వచ్చే లక్ష్మి "ఆ గుడిసెల్లోకి ఎందుకెళ్ళారండీ?" ఆశ్చర్యంగా అడిగింది.

నాగరాజు మనస్సు పరిపరివిధాల పోయింది. ఎందుకెళ్ళడ మేమిటి? అక్కడుండేది మనుష్యులు కాదా? మనుషులే ఐతే అంత కంపులో ఎట్లాబ్రతుకుతున్నారు? వాళ్ల నాస్థితిలోఉంచిన వాళ్లు మనుషులేనా?—చప్పున జ్ఞాపకమొచ్చింది. ఆ సంవత్సరం హాస్టలును హెడ్మాస్టరుగారు ఉద్ధరించినట్లు, అధికారులు వారిసేవను గుర్తించి సాలుకు ఐదువేల రూపాయిలు గ్రాంటు ఇచ్చినట్లు, ఈమధ్య పేపర్లో చదివాడు.

సేవ చేయడమంటే డబ్బు కాజేయటమని, గుర్తించటమంటే లంచం తిని కళ్ళు మూసుకోవటమని అర్థం చేసుకొన్న నాగరాజు పెదవి కొరుక్కున్నాడు. "ఐదువేలల్లో ఐదోవంతైనా ఖర్చవుతున్నదా? పోనీ వాళ్ళ.

పేరుతో డబ్బును దిగమింగే మహానుభావులు వాళ్ళని శుభ్రంగానైనా ఉంచగూడదా? వాళ్ళు స్నానంచేసి గుడ్డలుతుక్కోవడానికి ఏర్పాటైనా చేయగూడదా?" అనుకుంటూ నాగరాజు గదికి చేరుకొన్నాడు.

నాగరాజు స్కూలుకు వెళ్ళక పూర్వమే తాను హాస్టలు విషయంలో జోక్యం కలుగ జేసుకొంటున్నట్లుగా వార్త శ్రీవారికి చేరింది. అరి తేరిన ఘటికుడు విని ఊరుకొంటాడా?

గడ్డిమూటనెత్తలేని, కంపు భరించలేని నాగరాజుకు తాను చెయ్యగల్గిందొకటి కనిపించింది. తన క్లాసులోని హాస్టలు పిల్లల్ని నిల్చోపెట్టి, చీవాట్లువేసి స్నానంచేసి మరీ లోపలికి రమ్మని పంపించేశాడు. ఉపాధ్యాయ వృత్తి యొక్క పవిత్రత నిలబెట్టాలనే తన కోరిక ఆచరణలో కొస్తున్నదని కొంచెం ఆనందించాడు.

హెడ్మాస్టరుగారి అనుజ్ఞ లేనిదే పిల్లలను బయటికి పంపించినందుకు సంజాయిషీ వ్రాసి ఇచ్చి దిగులుగా బయటికి నడిచాడు నాగరాజు. "పిల్లల్ని పరిశుభ్రంగా ఉంచడం ఉపాధ్యాయుని కర్తవ్యంగాదా? దానికి వేరొకరి అనుజ్ఞ దేనికి? ఈమాత్రం అవకాశమిచ్చే హక్కు నా లేని వృత్తికి పవిత్రత నంటగట్టడం దేనికి?— ఏవో ప్రశ్నలు వేసుకొంటున్నాడు. 'సేవ' 'గుర్తించడం'— ఈ పదాలకు అర్థం మారినట్లే 'పవిత్రత'కు కూడ అర్థం మారిందని అతనికి తోచలేదు.

* * *

అయిదునెలలబట్టీ చూస్తున్నాడా పిల్లను. ఎప్పుడూ ముఖం ముడుచుకొనే కూర్చుంటుంది. ముఖంలో దైన్యం వంట్లో నీరసం కనిపిస్తూనే ఉన్నాయి. పదిహేడు పద్ధెనిమిది సంవత్సరాల వయస్సులో ఆడపిల్ల లట్లావుండటం అన్యాయ మనిపించింది నాగరాజుకి. సంగతేమిటో కనుక్కుందామని ఆవిడ ఇంటికి వెళ్ళాడు.

రెండుగదుల చిన్న ఇల్లు. అసహ్యంగా ఉంది. విడిచిన గుడ్డలు, పుస్తకాలు ఇంటి నిండా గందరగోళంగా ఉన్నై. హాలునిండా బూజు పట్టింది. ఆ పిల్లపేరు రత్నాబాయి. స్కూలు ఫైనల్ చదువుతున్నది. మేష్టరుగారిని చూచి గాభరాపడ్డది.

రత్నాబాయి దీన చరిత్రనంతా విన్నాడు. పొరుగూరి ఎలిమెంటరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆ దిక్కులేని పిల్లను పెంచుతున్నట్లు తెలుసుకొని లోకం గొడ్డు పోలేదను కొన్నాడు. వంటరిగా ఆపిల్ల అనుభవించే కష్టాలకు కన్నీరుకార్చాడు. ఉద్ధరించడానికి తనకో మంచి తరుణం దొరికిందని సంతోషించాడు.

ఆపిల్ల ఎంత వద్దంటున్నా వినకుండా బూజు దులపడంలో సహాయం చేశాడు. మైల గుడ్డలు ఎక్కడుంచాలిసింది, వంట సామాను ఎక్కడ జాగ్రత్త పెట్టాలిసింది, పుస్తకాలను ఎట్లా సర్దుకోవాలిసింది ప్రత్యక్షంగాచేసి చూపించాడు. ఆ పిల్ల నీరసానికి సోమరితనం కారణ మనుకొన్నాడు.

"నీవు ఉత్సాహంగా ఉండాలి. పెంద రాడే లేవాలి. పనిచూసుకొని ఏడు గంటల కల్లాస్నానంచేసి, ఉతికినగుడ్డలు కట్టుకోవాలి" ఉపదేశించాడు.

ఓరకంటగా చూస్తున్న రత్నబాయి అడిగింది, "ఎవరికోసం?"

అదిరిపోయినాడు నాగరాజు.

"ఎవరికోసమేమిటి?"

"నేను బ్రతకడం దేనికి?" రత్నాబాయి కళ్లు చెమ్మగిల్లాయి.

"దేనికేమిటి? నీలాంటి చదువుకొన్న పడుచులు దేశానికి చాలా అవుసరం"

ఎందుకన్నట్లుగా చూసింది రత్నాబాయి.

"నర్సరీ ట్రెయినుంగు పొందితే, బోలెడంత సేవ చేయవచ్చు" ఊరడించి, అనునయించి ఉపదేశించి, ఘనకార్యం చేసిన వీరుడిలాగు వెళ్ళిపోయినాడు నాగరాజు.

మరునాడు నాగరాజును రత్నాబాయి చిరునవ్వుతో ఆహ్వానించింది. గది శుభ్రంగా ఉంది. విడిచిన గుడ్డలు కనిపించలేదు. మంచం మీద తెల్ల దుప్పటి పరచి ఉంది. దిండుగలీబు మీది కుట్టుపని అతన్ని ఆకర్షించింది. నాగరాజు మంచంమీద కూర్చున్నాడు. పింగాణీ పళ్లెంలో గోధుమ రొట్టె, అల్యూమినియం గిన్నె లో నెయ్యి, గాజు కప్పులో చక్కెర తెచ్చి అక్కడ ఉంచింది రత్నాబాయి.

దిక్కులేని పేదపిల్లకు ఎక్కడా దొరకని చక్కెరెట్లా వచ్చిందనుకొంటున్నాడు నాగరాజు. పాల గ్లాసు "ఓవల్‌టిన్" తెచ్చింది రత్నాబాయి. "అయ్యో, ఆలోచిస్తూ కూర్చున్నారా? ఆరిపోతుంది త్వరగా కానీండి" దగ్గర కూర్చుని అంతరొక్కట్లే తినిపించేసింది.

సాయంకాలం ఐదు గంటలు. బడి వదిలి పెట్టారు. అంతా గందరగోళంగా చెప్పుకొంటున్నారు. రత్నాబాయి ఇంట్లో దొంగలుపడ్డారు. ఆరువందల రూపాయలు ఖరీదుచేసే చీరెలు పోయినయ్. ఏ పిల్లవాడి నోటివెంట చూసినా అదే గొడవ.

ఆవూరిలోకి పేరుపడ్డ రెడ్డిగారు, ఆప్రాంతాల్లోకి ధనికుడైన శెట్టిగారి కొడుకు నీవు చేయించావంటె నీవు చేయించావని గొడవ పడుతున్నారు పోలీసు స్టేషనులో. సబ్ ఇన్‌స్పెక్టరుగారు ఆరాతీస్తున్నారు. నాగరాజు అక్కడికి చేరేసరికి, రత్నాబాయి ఇంటికి వచ్చిపోయే వారి లిస్టు పూర్తిచేశారు ఇన్‌స్పెక్టరుగారు. అందులో మొదటిపేరు ప్రక్క గ్రామంలోని ఎలిమెంటరీ స్కూలు హెడ్మాస్టరుగారిది.

"ఈయన ఆపిల్ల తండ్రి" అన్నాడు నాగరాజు.

"అందుకనే మీ పేరు ఇందులో లేదు" అన్నారు ఇన్‌స్పెక్టరుగారు. రామ స్మరణ చేస్తూ నాగరాజు కళ్లు మూసుకొన్నాడు.

మిరపకోత ఐపోయింది. పూలులేని బంతిచెట్లు కంపలాగ నిల్చిఉన్నై. కంది కోడుతున్నారు. నాగరాజు నిరాశగా స్మశానంలో కూర్చుని ఆకాశంలోకి చూస్తున్నాడు.

స్కెచ్

# అనుకోని సంఘటన

## అవసరాల రామకృష్ణరావు

"ఏమేవ్!

ఇలాంటిగావు కేకలు అలవాటయినవే కాబట్టి సుందరమ్మ పెట్టే పోపు చప్పుడులో వినిపించినా పలకలేదు.

"ఇదుగో...నిన్నే..." ఈమారు సుందరమ్మ జవాబు చెప్పక తప్పిందికాదు. కాగుతున్న నూనె దింపేసి వీధిచావిడిలోకి వచ్చింది.

"ఎందుకండీ, అంతంత అరుపులు? ఏంకొంప మునిగిపోయిందీ?"

"ఏమీ లేదే. అబ్బాయి ఉత్తరం రాశాడు!"

"ఏమనీ?"

"అదే చెప్పుకో చూద్దాం!"

"వయసు మళ్లినా మీ హాస్యాలు తగ్గలేదు. ప్రక్కగదిలో అల్లుడూ, కూతురూ ఉన్నారు. వింటే బాగుండదు. మీతో ముచ్చట్లు చెపుతూ కూర్చోడానికి నాకేం తీరిక లేదు. ఏమిటో చెప్తారా, చెప్పరా?"

"చెప్పను."

ఇలాంటి వ్యతిరేక సమాధానం ఆసించక పోవడంవల్లసుందరమ్మ వెలవెలబోయి,అయినా "మొగుడు బలిమాలడా?" అన్న ఆశ చంపుకోలేక, వంటింటివైపు వెనక్కి చూడకుండా నాలుగడుగులు నడిచి, అలాంటి చిహ్నాలేవీ కనిపించక పోవడంవల్ల వెనక్కి తిరిగి,

"అంతకోపం ఎందుకండీ?" అంది బ్రతిమాలినట్టుగా.

"లేకపోతే ఏమిటీ, ఎంతో మంచి కబురు చెపదామని నే పిలవడమేమిటి. క్షణం తీరికలేని ఆఫీసర్లా "రంయ్" మని వచ్చి..."

"బాగుందండోయ్, మా ఆడవాళ్ళకు వంటిల్లే ఆఫీసు అప్పుడాలే కాగితాలు, పోపుల పెట్టే లైపు రైటరు, తప్పేలా గిన్నెలే సర్వెంట్లు."

సుందరమ్మ మాటలకి ఇద్దరూ పకపక నవ్వుకొన్నారు. సమయానుకూలంగా పురుషులను లోబరుచుకోవడం ఆడదానికి పుట్టుకతో వచ్చిన విద్య. ఈ సదవకాశం పోనియ్యకుండా సుందరమ్మ,

"ఇంతకీ అబ్బాయి ఏంరాశాడో చెప్పేరు కారు" అంది.